క్లుప్తంగా

కేంద్ర మంత్రిని కలిసిన నాయకులు



బండి సంజయ్‌తో రజక సంఘం నాయకులు

రామడుగు: మండలంలోని రుద్రారం గ్రామానికి చెందిన రజక సంఘం నాయకులు మంగళవారం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను కరీంనగర్‌లో కలిసి సన్మానించారు. సంఘానికి సంబంధించి బోరు బావి కోసం నిధులు మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల నాయకులు ఒంటెల కరుణాకర్‌రెడ్డి, కట్ట రవీందర్, మునిగంటి శ్రీనివాసాచారి, ఓరుగంటి మహేష్, కోటగిరి ప్రశాంత్, రజక సంఘం ప్రతినిధులు రాచకొండ సాయిలు, మల్యాల రాజు, రవి, కర్ణాకర్, ఆంజనేయులు, రాములు, సతీశ్ పాల్గొన్నారు.

నిధుల మంజూరుపై హర్షం



క్షీరాభిషేకం చేస్తున్న ముస్లింలు

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని పెద్దపాపయ్యపల్లి, కందుగుల గ్రామాల్లో కమ్యూనిటీ హాల్, కబ్రస్థాన్ ప్రహరీ నిర్మాణం కోసం కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇంచార్జి వొడితెల ప్రణవ్ నిధులు మంజూరు చేయించడం పట్ల ముస్లింలు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం మసీద్ ఆవరణలో ప్రణవ్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

వీణవంక: మండలంలోని మల్లారెడ్డిపల్లి గ్రామంలో శ్రీరామాంజనేయ ఆలయ గోడ నిర్మాణానికి ప్రణవ్ రూ.ఐదులక్షలు మంజూరు చేసినట్లు మాజీ సర్పంచ్ మేకల ఎల్లారెడ్డి తెలిపారు. నిధుల మంజూరుకు కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పల్లెర్ల కిరణ్ తదితరులు ఉన్నారు.

హుజూరాబాద్: పట్టణంలోని హనుమాన్ దేవస్థాన అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యాయని దేవస్థాన చైర్మన్ కొలిపాక శంకర్ మంగళవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలిపారు. ఏళ్లుగా ఆలయం అభివృద్ధి నోచుకోకపోవడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారని, సమస్యను ప్రణవ్ దృష్టికి తీసుకెళ్లగా రూ.ఇరవై లక్షల నిధులు మంజూరు చేయించారని, అభివృద్ధి పనులు చేపడతామన్నారు. నిధుల మంజూరుకు కృషిచేసిన వొడితెల ప్రణవ్ చిత్రపటానికి నాయకులు పాలాభిషేకం చేశారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

చిగురుమామిడి: మండలంలోని రేకొండలో మంగళవారం రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో నలుగురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు..రేకొండ నుంచి తిరుపతి, అతని భార్య చిగురుమామిడికి, చిగురుమామిడి నుంచి రేకొండకు గడ్డం అనిల్ అతని భార్య బైక్‌లపై వస్తూ ప్రమాదానికి గురయ్యారు. గాయపడిన వారిని 108లో కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

జీఎస్టీపై వాగ్వాదం



నిర్వాహకులతో నాయకుల వాగ్వాదం

శంకరపట్నం: కేశవపట్నంలోని ఓ సూపర్‌మార్కెట్ నిర్వాహకులతో అఖిలపక్షం నాయకులు మంగళవారం వాగ్వాదానికి దిగారు. కొన్ని వస్తువులపై కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించినా పన్ను వసూలు చేస్తున్నారనే సమాచారంతో నాయకులు దొంగల రాములు, దండు కొంరయ్య, రాజిరెడ్డి, గోపి వీరమల్లు, సుధాకర్‌రెడ్డి తదితరులు సూపర్ మార్కెట్‌కు చేరుకొని నిర్వాహకులను నిలదీశారు.

సెల్‌ఫోన్లు అప్పగింత

రామడుగు: మండల కేంద్రానికి చెందిన రాగం సాయి, ఎలగందుల రామకృష్ణ మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా పోలీసులు ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం ఎస్సై కె. రాజు బాధితులకు ఫోన్లు అందజేశారు.

వర్షానికి కూలిన ఇల్లు

హుజూరాబాద్: పట్టణంలోని పోచమ్మవాడలో మంగళవారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి ఇల్లు కూలింది. కాలనీకి చెందిన రవివనిత దంపతులు కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఇంటి పైకప్పును ఇటీవల కోతులు ధ్వంసం చేయడంతో ఇల్లు కూలిందని భార్యభర్తలు కన్నీటి పర్యంతమవుతున్నారు. అధికారులు స్పందించి ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

శంకరపట్నం: కేశవపట్నంలో మంగళవారం ఈదురుగాలులతో కూడిన వర్షంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.



అందరూ ఒకచోట చేరే పండుగా



చిన్నప్పటి నుంచి ఇప్పటి వరకు బతుకమ్మ పండుగా వచ్చిందంటే సొంతూరిలోని చిన్ననాటి స్నేహితులం ఒక్కచోట కలుస్తాం. బతుకమ్మ వేడుకలు సంబురంగా జరుపుకుంటాం. అందరం కలిసి బతుకమ్మలను పేర్చి ప్రధాన కూడళ్ల వద్ద ఆడిపాడుతాం. అందరు ఒకచోట చేరే పండుగా బతుకమ్మ.

– కూతురు సంజన, జమ్మికుంట

ఏడాదిపాటు ఎదురుచూస్తాంటాం



తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు చెందిన బతుకమ్మ అనాదిగా అందరి మన్ననలు పొందుతోంది. పండుగ కుటుంబంలోని అందరిని ఒక్క దగ్గరకి చేర్చుతుంది. తొమ్మిది రోజులు కుటుంబ సభ్యులతో కలిసి బతుకమ్మ పండుగా చేసుకుంటాం. పండుగ ఎప్పుడు వస్తుందా అని ఏడాదిగా ఎదురు చూస్తాంటాం.

– కొలకాని బబిత, జమ్మికుంట

పూల పండుగ



ప్రతీ సంవత్సరం బతుకమ్మ పండుగ సందర్భంగా తీరొక్క పువ్వులను తీసుకువచ్చి అందమైన బతుకమ్మను పేర్చి చిన్నాపెద్ద తేడా లేకుండా ఆడిపాడుతాం. బతుకమ్మ పండుగను సంతోషంగా జరుపుకుంటాం. పండుగ రోజుల్లో ఇంట్లో సందడి వాతావరణం నెలకొంటుంది. అందరం పండుగను ఆనందంగా జరుపుకుంటాం.

– దాసరి సంగీత, జమ్మికుంట

పవర్‌కట్‌తో పరేషాన్

- అరగంటకోసారి సరఫరా నిలిపివేత
- రైతులు, వ్యాపారుల ఇబ్బందులు



గంగాధర: ఓ వైపు కరెంట్ వైర్ల దొంగలు మరోవైపు అరగంటకోసారి విద్యుత్ సరఫరా నిలిచిపోతుండటంతో రైతులు, ఇతర పనులు చేసుకునేవారు ఇబ్బందులు పడుతుండటం గంగాధర మండలంలో నిత్యకృత్యమయ్యాయి. వారం రోజులుగా కరెంట్ సరిగా సరఫరా కావడం లేదని అధికారులను అడిగితే పైనుంచి పోతుందనే సమాధానం చెబుతున్నారని సమస్య పరిష్కారం కావడం లేదని వాపోతున్నారు. వానాకాలంలో వేసవిని తలపించే ఎండలతో రైతులు ప్రతీరోజు వరి పంటకు నీరందించడం తప్పడం లేదని, పలుమార్లు కరెంట్ ట్రిప్పు అవుతుందని, ఆటోమేటిక్ స్టార్టర్లు పెట్టినా పొలం పారడానికి తిప్పలు తప్పడం లేదని రైతులు, వ్యాపారులు వాపోతున్నారు. ఆటోమేటిక్ స్టార్టర్లు లేని రైతులు పొలం వద్దనే ఉండాల్సి వస్తుందని, పండుగ పూట కోతలు ఏంటని ప్రశ్నిస్తున్నారు. వెల్డింగ్, సెంట్రింగ్, సర్వీసింగ్ పనులు చేసుకునేవారు పవర్‌కట్‌తో నష్టపోతున్నామని వాపోతున్నారు. 'కరెంట్‌తోనే సెంట్రింగ్ పని సాగుతుంది. తరుచూ కరెంట్ పోతుండటంతో పనులు సాగడం లేదు. పని చేయడానికి వచ్చిన కూలీలకు డబ్బులు చెల్లించక తప్పడం లేదు' సమస్యను పరిష్కరించాలని ఇస్మాయిల్ అనే సెంట్రింగ్ వ్యాపారి ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. 'బతుకమ్మ, దసరా పండుగల నేపథ్యంలో వాహనాల సర్వీసింగ్‌కు ఫుల్ గిరాకీ ఉంటుంది. పవర్ ఉంటేనే వాహనాలు శుభ్రం చేయగలం, తరుచూ కరెంట్ పోతుండటంతో సర్వీసింగ్‌కు వచ్చేవారు వెనుదిరిగిపోతున్నారు. పండుగల పూట గిరాకీ పోతుంది' అధికారులను అడిగితే మాకు తెల్వదు పైనుంచి సరఫరా నిలిచిపోయిందనే నిర్లక్ష్య సమాధానం చెబుతున్నారని సర్వీసింగ్ సెంటర్ నిర్వాహకుడు శ్రీకాంత్ వాపోతున్నాడు.



గంగాధరలో బతుకమ్మ సంబరాలు



రామడుగు: వెలిచాలలో...

బతుకమ్మ సంబరాలు

గంగాధర: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం బతుకమ్మ సంబరాలతో పాటు పోషణ్ అభియాన్ నిర్వహించారు. తల్లులకు పోషకాహార పదార్థాల వినియోగం, స్థానికంగా లభించేవాటితో వంటలు తయారు చేయడం గూర్చి అవగాహన కల్పించారు. ప్రీ స్కూల్‌కు సంబంధించిన ఆటవస్తువులు, స్వదేశి బొమ్మలు తయారీ గురించి వివరించారు. సమావేశంలో సీడీపీవో నర్సింగరాణి, సూపర్‌వైజర్ రేణుక, అంగన్‌వాడీ టీచర్లు అరుణ, భారతి, లక్ష్మి, నిర్మల, సావిత్రి ఆయమ్మలు శ్వేత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రామడుగు: వెలిచాలలోని ఓ ప్రైవేటు స్కూల్‌లో బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. హెచ్‌ఎం ఉప్పుల శ్రీనివాస్, కో కరస్పాండెంట్ సత్యం, ప్రముఖ ఫోక్ సింగర్ వొల్లాల వాణి, మాజీ ఎంపీపీ వీర్ల నర్సింగరావు, మాజీ సర్పంచ్‌లు రవీందర్ రావు, కాడె శంకర్, మాజీ ఎంపీటీసీ బండపల్లి యాదగిరి, శ్రీప్రగతి హైస్కూల్ చైర్మన్ అన్నదానం రాధాకృష్ణ, జడ్పీ కోఆప్షన్ మాజీ సభ్యుడు శుక్రుద్దీన్, హన్మంతరావు పలువురు పాల్గొన్నారు.

కిట్స్‌లో క్యాంపస్ డ్రైవ్

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని సింగాపూర్ కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం క్యాంపస్ డ్రైవ్ నిర్వహించినట్లు కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె. శంకర్, ఉపాధి కల్పన శిక్షణాధికారి డాక్టర్ విజయలక్ష్మి తెలిపారు. ఎస్‌ఎంఎస్‌ఎల్ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో డ్రైవ్ జరిగిందని, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ ఉత్తీర్ణులైన విద్యార్థులు పాల్గొనగా 50 మంది ఫైనల్ ఇంటర్వ్యూకు ఎంపికయ్యారని వివరించారు. ఎలక్ట్రికల్ విభాగాధిపతి డాక్టర్ యోగేశ్ పుండలిలీక్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

26న ఇసుక వేలం

గన్నేరువరం: ఇటీవల గుండ్లపల్లిలో పట్టుకున్న ఇసుకను మండల కేంద్రంలో నిల్వ చేశారు. సుమారు 45 టన్నుల ఇసుకకు 26న వేలం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ నరేందర్ తెలిపారు. వేలంలో పాల్గొనేవారు ముందుగా రూ.ఐదువేలు అడ్వాన్స్‌గా చెల్లించాలని, వేలంలో ఇసుకను దక్కించుకున్నవారు 24 గంటల్లో పూర్తి డబ్బు చెల్లించాలని తెలిపారు.

క్షయ రహిత గ్రామాలే లక్ష్యం



షకార్డులు ప్రదర్శిస్తున్న టీబీ చాంపియన్స్, వైద్యులు

చొప్పదండి: ఇంపాక్ట్ ఇండియా ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో క్షయ రహిత గ్రామాలే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని మెడికల్ అధికారి సురేందర్ అన్నారు. పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం టీబీ ఛాంపియన్స్ కార్యక్రమం నిర్వహించారు. పీహెచ్‌సీల ద్వారా గ్రామాల్లో క్షయ వ్యాధి బారినుంచి కోలుకున్న వారితో వైద్యాధికారులు మాట్లాడారు. ప్రభుత్వం వ్యాధి నివారణకు ఉచిత వైద్యం అందిస్తోందని, టీబీని జయించిన వారితో ప్రచారం నిర్వహిస్తున్నామని, వ్యాధితో బాధపడే వారు జాగ్రత్తలు తీసకో వడం ద్వారా ఇతరులకు వ్యాపించకుండా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటస్వామి, సూపర్‌వైజర్ శ్రీదేవి, జిల్లా ట్రెనింగ్ మేనేజర్ సురేందర్, ఎస్‌టీఎస్ రఘునందన్, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ప్రభాకర్, అనుపురం శ్రీను, వనిత, తదితరులు పాల్గొన్నారు.

నియామకం



ఉత్తర్వులు అందజేస్తున్న నాగుల కనుకయ్య

చిగురుమామిడి: మండలంలోని ఇందుర్తి గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం నాయకుడు చెల్పూరి విష్ణమాచారి బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శిగా నియామకమయ్యారు. మంగళవారం జిల్లా అధ్యక్షుడు నాగుల కనకయ్య ఉత్తర్వులు అందించారు. చిగురుమామిడితో పాటు జిల్లాలోని అన్ని మండలాల్లోని బీసీలను చైతన్యపరిచి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. ఎన్నికకు సహకరించిన ప్రతీ ఒక్కరికి విష్ణమాచారి కృతజ్ఞతలు తెలిపారు



గన్నేరువరం: కల్వర్టుపై ఏర్పడిన గుంతలో కూరుకుపోయిన ఆటో



చిగురుమామిడి: నీటిలో నుంచి ప్రభుత్వ ఆఫీసులకు వెళ్తున్న మహిళలు

ప్రమాదకరంగా కల్వర్టు

గన్నేరువరం: మండల కేంద్రం గన్నేరువరం నుంచి కరీంనగర్ వెళ్లే ప్రధాన రోడ్డు మధ్యలోని జంగాపల్లి వద్ద కల్వర్టు ప్రమాదకరంగా తయారైంది. సోమవారం కురిసిన వర్షానికి కల్వర్టు పైనుంచి వరదనీరు ప్రవహిస్తోంది. దీంతో కల్వర్టు ధ్వంసం కావడంతో రాకపోకలకు వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. హన్మాజిపల్లి నుంచి జంగాపల్లి వైపు వెళ్లే ఓ ఆటో మంగళవారం కల్వర్టుపై ఏర్పడిన గుంతలో కూరుకుపోయింది. చేసేదిలేక ప్రయాణికులు, స్థానికులు ఆటోను కష్టం మీద బయటకు లాగారు. లో లెవెల్ కల్వర్టు స్థానంలో హై లెవెల్ బ్రిడ్జి నిర్మించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

నీటిలో నడుస్తూ వెళ్లాల్సిందే..

చిగురుమామిడి: మండలపరిషత్, రెవెన్యూ, ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే ప్రజలు నిత్యం నీటిలో నడుస్తూ ఇబ్బందులు పడుతున్నారు. ఇరవై ఐదేళ్లుగా మండలంలోని 17 గ్రామాలకు చెందిన ప్రజలు ఆయా పనుల నిమిత్తం ప్రభుత్వ కార్యాలయాలకు వస్తుంటారు. వర్షాకాలం వచ్చిందంటే మాలకుంట మత్తడి నీరు సీసీరోడ్డు పైనుంచి ప్రవహిస్తూ ఉంటోంది. ఇలా ప్రతి సంవత్సరం వర్షాకాలంలో రెండు నెలల పాటు ప్రజలు నీటిలో నడుస్తూ కార్యాలయాలకు చేరుకుంటారు. మరోవైపు ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి కింద పడిపోతున్నారు, అలాగే ప్రభుత్వ కార్యాలయాలకు కాలినడకన వెళ్లే వారు ఫీటు లోతు నీటిలో నడుస్తూ జారీ పడిపోతున్నారు. ఇలా ఎన్నిరోజులు నీటిలో నడవాల్సి వస్తుందోనని పలువురు విస్తుపోతున్నారు. కుంట నుంచి వచ్చే మత్తడి నీరు వేరే మార్గం గుండా వెళ్లేలా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని పలువురు అధికారులను కోరుతున్నారు. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించాలని, ప్రజల కష్టాలను తీర్చేలా మత్తడి వద్ద చిన్న బ్రిడ్జి నిర్మించాలని మండల ప్రజలు కోరుతున్నారు.



వీణవంక: మండలంలోని కోర్కల్ గ్రామ మూలమలుపు వద్ద ప్రధాన రోడ్డుపై గుంతలు ఏర్పడటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం వందలాది వాహనాలు కరీంనగర్‌కు ఈ దారిపై వెళ్తుంటాయి. కాంట్రాక్టర్ కంకర పోసి వదిలేయడంతో గుంతలు ఏర్పడ్డాయని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతు పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
రాజశేఖర్‌రెడ్డి, డీఈ, పంచాయతీరాజ్ సెల్: 83281 31368

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

దుర్గామాత మండపంలో ఈటల పూజలు



పూజలు చేస్తున్న ఎంపీ ఈటల రాజేందర్, తదితరులు

జమ్మికుంట: పట్టణంలోని హౌజింగ్‌బోర్డుకాలనీతోపాటు వివిధ వార్డుల్లోని మండపాల్లో కొలువుదీరిన దుర్గామాతను మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ మంగళవారం దర్శించుకున్నారు. ఈసందర్భంగా నిర్వాహకులు, అర్చకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఈటల ప్రత్యేక పూజలు చేసి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో నాయకులు మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, మాజీ జెడ్పీటీసీ శ్రీరాం శ్యామ్, ఎర్రబెల్లి సంపత్ రావు, జీడి మల్లేశం, నిర్వాహకులు విజేందర్‌రెడ్డి, నసీరొద్దీన్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

చిగురుమామిడి: చిగురుమామిడి శివాలయంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపంలో మంగళవారం ఎస్సై సాయికృష్ణ ప్రత్యేక పూజలు చేశారు. ఎస్సైని మండప నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. మ్యాన కవితదంపతులు మహాన్నదాన కార్యక్రమం చేపట్టగా భక్తులకు ఎస్సై స్వయంగా వడ్డించారు. కార్యక్రమంలో పూజారి ఆకవరం శివ ప్రసాద్, మాజీ ఉపసర్పంచ్ ముక్కెర సదానందం, తిరుపతి, సింగిల్‌విండో సీఈవో కాటం నర్సయ్య, అమర్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



అన్నదాన కార్యక్రమంలో ఎస్సై సాయికృష్ణ

ఐలమ్మ జయంతిని విజయవంతం చేయాలి

హుజూరాబాద్: ఈ నెల 26న చిట్యాల ఐలమ్మ జయంతిని రజక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్నామని సంఘం నాయకులు తెలిపారు. మంగళవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పట్టణంలోని ఏరియా ఆసుపత్రి సమీపంలో ఐలమ్మ విగ్రహం వద్ద జయంతి నిర్వహిస్తామని, విద్యావేత్తలు, ప్రజా, ఉద్యోగ సంఘాలు, మేధావులు, యువకులు నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కొలిపాక సారయ్య, నిమ్మటూరి సాయికృష్ణ, కొలిపాక శంకర్,సుంకరి రాజమౌళి, కొలిపాక శ్రీనివాస్, గోపు సారయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రజక సంఘం నాయకులు

గుండెపోటుతో జీపీ కార్మికుడి మృతి



తిమ్మాపూర్: మండలంలోని పోరండ్ల గ్రామానికి చెందిన జీపీ కార్మికుడు కిన్నెర దుర్గయ్య (58) గుండెపోటుతో మృతి చెందాడు. మంగళవారం ఉదయం గ్రామంలో మురుగుకాలువలు శుభ్రం చేసి ఛాతిలో నొప్పి రావడంతో ఆర్‌ఎంపీ వద్ద చూపించుకొని ఇంటికి వెళ్లాడు. ఇంట్లో నీరు తాగి ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. ఆర్‌ఎంపీ సీపీఆర్ చేసినా ఫలితం లేకుండా పోయింది. పదేళ్లుగా పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్న దుర్గయ్య మృతితో గ్రామంలో విషాదం నెలకొంది. దుర్గయ్యకు భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. దుర్గయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు. దుర్గయ్య నేత్రాలను దానం చేయనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

రక్తదాన శిబిరం

కరీంనగర్‌టౌన్: తెలంగాణ గ్రామీణ బ్యాంకు కరీంనగర్ 50ఏళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్ సెంటర్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ కేశవరెడ్డి, సెక్రెటరీ రాధాకృష్ణారెడ్డి, మెంబర్ వేణు, రీజినల్ మేనేజర్ బాలనాగు, తదితరులు సిబ్బంది పాల్గొన్నారు.